క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరాలతో ప్రయోజనం

పశువైద్యాధికారి జయసుధ



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

శంకర్‌పల్లి: ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి జయసుధ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అలంఖాన్‌గూడ గ్రామంలో క్యాటిల్ డే సందర్భంగా ఫ్లోరిటాన్ ఇండియా గ్రామ శక్తి వారి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వైద్య శిబిరంలో 756గేదెలకు, 12ఆవులకు, 177లేగ దూడలకు, 138 మేకలకు వైద్య చికిత్సల నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మౌనిక నరేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య అధ్యక్షతన 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. మండలస్థాయిలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. అదే విధంగా అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఘనంగా జ్యోతిర్లింగ మహాపడి పూజ



పడిపూజలో పాల్గొన్న స్వాములు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారంలో గ్రామంలోని శుభాష్‌గౌడ్ గృహంలో శనివారం ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో శివ స్వాములు పూజలో పాల్గొన్నారు. దీంతో గ్రామమంతా శివనామస్మరణతో మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి భూపాలచారి, శివస్వాములు నర్సింలు, యాదయ్య, రామకృష్ణ, బుగ్గయ్య, రాంరెడ్డి, వెంకట్‌రాములు, లింగం పాల్గొన్నారు.

రాయితీని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్‌టౌన్: శుభకార్యాలు, విహార యాత్రలకు వెళ్లేందుకు అద్దెకు ఆర్టీసీ బస్సులను తీసుకెళ్లేందుకు టీఎస్‌ఆర్టీసీ 10శాతం రాయితీని ప్రకటించిందని డీఎం ఉష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ 30జూన్ 2023 వరకు ఉంటుందని తెలిపారు. టీఎస్‌ఆర్టీసీ అందిస్తున్న రాయితీని షాద్‌నగర్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సర్కార్

టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారని టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ, వెంకన్నగూడ, కొంగగూడ తండా, మెల్లగూడతండాలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలందరికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ పేదల కష్టాలను బడా పారిశ్రామిక వేత్తలకు దోచి పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అందరి ఆశీస్సులతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, శ్రీకాంత్‌గౌడ్, రవీందర్, వంశీగౌడ్, ఉదయ్‌గౌడ్, కాటసుధీర్, జీజో, మెహరాజ్, మహేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, నర్సింహ్మ, సోమ్లానాయక్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, సురేందర్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలకు చెక్

- ఫారం–డీని పాటించాల్సిందే
- ఇక విత్తనాల లెక్క పక్కాగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి
- ప్రతీ నెల 5వ తేదీలోపు వివరాల నమోదు
- లేకుంటే చర్యలు తప్పవన్న వ్యవసాయశాఖ



షాబాద్‌లో సాగవుతున్న వరి పంట

షాబాద్: ఇక నకిలీ విత్తనాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకువచ్చింది. లైసెన్స్‌డ్ విత్తన డీలర్లు అక్రమ నిల్వలు చేయకుండా ఉన్న నిల్వల సమాచారం పక్కాగా ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా ఫారం–డీని తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలు సవరణలు చేస్తూ రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ సైట్‌లో సదరు వివరాలతో వింగ్ ఏర్పాటు చేయగా, అందులో విత్తన డీలర్లకు అవగాహన సదస్సులు నిర్వహించగా, నమోదు ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి పర్యవేక్షణలో మండలాల వ్యవసాయ అధికారులు డీలర్లకు ఐడీ, లాగిన్ క్రియేట్ చేయగా వివరాలను నమోదు చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సాంకేతిక లోపాలను గుర్తించి వెంటనే సరిచేస్తున్నారు.

నకిలీకి అడ్డుకట్ట..

జిల్లా వ్యాప్తంగా చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని 25 మండలాల్లోని గ్రామాల్లో రైతులు, 86 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. 564 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ప్రతి ఏటా ఏదో ఒక మూలన నకిలీ విత్తనాల విక్రయాలు పెచ్చుమీరుతుండగా పోలీసులు, వ్యవసాయశాఖ కేసులు నమోదు చేస్తున్నాయి. పత్తి, మొక్కజొన్న, మిర్చి, వరి, టమాట విత్తనాలు సరఫరా చేస్తుండగా ఈ ప్రక్రియతో దాదాపు సగం కల్తీని నిలువరించినట్లే అవుతుంది. కొంత మంది డీలర్లు నిషేధించిన మిర్చి విత్తనాలను సైతం డీలర్లతో కలిసి విక్రయించారు. వాటిని పెద్ద ఎత్తున కొనుగోలు చేసి మిర్చి పంటలను సాగు చేశారు. సైట్‌లో పొందుపర్చిన ఆధారాలను పరిగణిస్తూ రాష్ట్రస్థాయి నిఘా బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టనుంది. నకిలీ విత్తనాలు కనిపిస్తే కఠినంగా వ్యవహరించనున్నారు. అవసరమైతే జైలుకు కూడా పంపే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇక డీలర్లు కాకుండా ఇతర వ్యాపారులు విత్తనాలు విక్రయించినా లైసెన్స్ లేదని వెబ్‌సైట్ ద్వారా వెంటనే తెలిసిపోతుంది. జిల్లా వ్యవసాయశాఖతో సంబంధం లేకుండా ఏ జిల్లా అధికారులైనా తనిఖీలు చేయొచ్చని స్పష్టమవుతుంది. సాగు విస్తీర్ణం క్రమంలో ఏ విత్తనాలు వేస్తున్నారు, ఎంత వేశారు, ఏయే విత్తనాలు మిగిలాయన్న వివరాలు త్వరగా స్పష్టమవుతుంది.

ఏ విత్తనాలు ఎన్ని...

ఫారం–డీలో ఏయే కంపెనీ విత్తనాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని రకాల విత్తనాలు, లాట్ నంబర్, కంపెనీ వివరాలు, విక్రయించింది ఎంత, నిల్వ ఎంత నేది ప్రతి నెల 5వ తేదీలోపు ఫారం–డీ సైట్‌లో పొందుపర్చాలి. జిల్లాలో 589 మంది విత్తన డీలర్లు ఉండగా ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న, పె సలు, కందులు, మినుములు, కూరగాయల విత్తనాలు తదితర వాటిని విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో దాదాపు అన్ని మండలాల్లో కనిష్టంగా రెండు మూడు గ్రామాలకు ఒక ఫర్టిలైజర్ దుకాణం ఉంది.

నిత్యం పర్యవేక్షణ...



విత్తన డీలర్లపై నిత్యం పర్యవేక్షణ ఉంది. 1 నుంచి 5వ తేదీలోపు ఫారం–డీలో వివరాలు పొందుపర్చకుంటే వెంటనే వ్యవసాయ అధికారులు సమాచారం ఇస్తారు. నోటీసులు, చర్యలు తీసుకోవడం జరుగుతుంది. దీనిపై ఎలాంటి జాప్యం లేకుండా కఠినంగా వ్యవహరిస్తాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

ఘనంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల: మండలంలోని దేవరాంపల్లి గ్రామంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రెండవ రోజు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళాలంతా కలిసి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. గణపతి పూజ, విష్ణు యాగము, అంజనేయస్వామి పంచామృతాభిషేకం, అర్చన, అనంతపద్మనాభ స్వామి పూజ, హోమం, పూర్ణహుతి, అన్నదానం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

కేశంపేట: ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని లేమామిడికి చెందిన పాండుకు రూ.60వేలు, కాకునూరుకు చెందిన హన్మంత్‌రెడ్డికి రూ.60వేలు, చెన్నరాములుకు రూ.56,500, కొత్తపేటకు చెందిన నర్సమ్మకు రూ.60వేలు, ఈశ్వర్‌కు రూ.24వేలు, సయ్యద్‌పాషాకు రూ.18 వేలు, అల్వాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు రూ.25వేలు, సూరమ్మకు రూ.17వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను శనివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే సీఎం కేసీఆర్ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది ఆర్థిక సమస్యలతో వైద్య ఖర్చులకు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాంటి వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, సీఎస్‌సీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి

ముదిరాజ్ సంఘం యువజన విభాగం మండల కన్వీనర్ బాల్‌రాజ్



నియామక పత్రాలను అందజేస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమని ముదిరాజ్ సంఘం యువజన విభాగం మండల కన్వీనర్ కుడుముల బాల్‌రాజ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘం కమిటీల ఏర్పాటును పూర్తి చేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు సరైన ప్రోత్సాహం లేకపోవడంతో అన్ని రంగాల్లో వెనుబడి ఉన్నారని అన్నారు. సమస్యల సాధనకు కలిసి కట్టుగా కృషి చేయాలని చెప్పారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ముఖ్యకూడలిలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పండుగసాయన్న విగ్రహావిష్కరణకు మాజీమంత్రి ఈటల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్, బండప్రకాష్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్ హాజరవుతారని తెలిపారు. తెలంగాణలో ఉన్న బీసీల జనాభాకు అనుగుణంగా విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధిని సాధించడానికి కావాల్సిన ప్రణాళికలను రూపొందించడం కోసం సమావేశాను ఏర్పాటు చేస్తామన్నారు. ముదిరాజ్‌లందరూ పూర్తి సహాయ సహకారాలను అందించడంతోనే గ్రామాల్లో ముదిరాజ్ కమిటీలను పూర్తి చేశామని, ఈ కమిటీల ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, పెద్దలు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడంపై ఆగ్రహం

- అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా
- నిందితుడిని శిక్షించాలని డిమాండ్



ర్యాలీ, ధర్నా చేస్తున్న అఖిలపక్షం నాయకులు

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని కించపరిచే మూర్ఖులను కఠినంగా శిక్షిస్తేనే మరొకరు ఇలాంటి సాహసం చేయరని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ ధర్నాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఐ, ప్రజా సంఘాలు, అంబేడ్కర్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హమారా ప్రసాద్ అనే మూర్ఖుడికి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు అంబేడ్కర్ లాంటి మహనీయులను కీర్తిస్తుంటే కొందరు ఆయనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అరెస్టైన అతడిని కఠినంగా శిక్షిస్తేనే మరొకరు ఆరోపణలు చేసేందుకు భయపడిపోతారని తెలిపారు. అఖిలపక్షం నాయకుల ధర్నాతో హైదరాబాద్–బీజాపూర్ రహదారి ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్, సీపీఐ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రభాకర్, రామస్వామి, వసంతం, శ్రీనివాస్‌గౌడ్, ప్రభులింగం ప్రభాకర్, సత్తిరెడ్డి, రవీందర్, సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

షాబాద్‌ను ఆదర్శ మండలముగా తీర్చిదిద్దుతాం

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



సర్పంచ్‌కు నిధుల ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: అధిక నిధులు తీసుకువచ్చి జిల్లాలోనే షాబాద్ మండలాన్ని ఆదర్శ మండలముగా తీర్చిదిద్దుతామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లకు నిధుల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని వివిధ అభివృద్ధి పనులకు రూ.11.70 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సమస్యలు లేని గ్రామాలుగా మారుస్తామని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం, విద్యుత్ సమస్యలు పరిష్కరానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మండల కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, నాయకులు రాజేందర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, రాందేవ్‌యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులున్నారు.

గులాబీ గూటికి కాంగ్రెస్ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీపీ

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గ్రామ సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎంపీపీ రవీందర్‌యాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కష్టపడుతున్నారని అన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, నియోజకవర్గంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులైన వారు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తిరుమలరెడ్డి రాజు, కృష్ణయాదవ్, శంకరయ్య, రాజేందర్, రాజు, శ్రీశైలం, మల్లేష్, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

చేవెళ్ల: గ్రామాల్లోని పేదల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని మిర్జాగూడ సర్పంచ్ భీమయ్య అన్నారు. మండలంలోని మిర్జాగూడ గ్రామంలో శనివారం వెల్‌స్పన్ ఫౌండేషన్, పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వారి సహకారంతో పద్మావతి మహిళ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ భీమయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. గ్రామంలోనే వైద్య పరీక్షలు చేయడంతో ఎక్కువ మంది ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 301 మంది వైద్యసేవలు పొందినట్లు చెప్పారు. ఇందులో 34 మందికి ఆపరేషన్‌లు అవసరం ఉన్నట్లు గుర్తించి సోమవారం ఆపరేషన్‌లు చేయిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో పీఎంఆర్ ఆస్పత్రి డీజీఎం సుమన్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బలిదాన్ దివస్



బలిదాన్ దినోత్సవం నిర్వహిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

చేవెళ్ల: సంఘటిత సమాజం గురించి పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చక్కని వివరణ ఇచ్చారని బీజేవైఎం టౌన్ అధ్యుడు బండారి శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ బలిదాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసి సంఘటితంగా రూపొందడమే ప్రగతికి మార్గమని వేర్వేరుగా అసంఘటిత వ్యక్తులుగా జీవించడం వినాశనానికి మార్గమన్నారు. సంఘటితంగా ఉన్నంత కాలం మనిషి అమరుడేనని చెప్పారని గుర్తు చేశారు. వ్యక్తుల జీవితం మరణంతోనే అంతం. కానీ, మహనీయులు భౌతికంగా లేకపోయినా అందరి హృదయాల్లో చిరస్థాయిగా జీవించి ఉంటారని చెప్పారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ద్వారా దేశసేవను ఆరంభించారని అన్నారు. జనసంఘ్ వ్యవస్థాపక సభ్యుడైన దీన్ దయాల్ ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీకి పటిష్ట పునాదులు వేసిన వ్యక్తిని తెలిపారు. అలాంటి మహనీయుల జీవితాలు అందరికి ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు అభిలాష్ బాబు, మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, బీజేవైఎం టౌన్ సెక్రటరీ జై సింహారెడ్డి, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జనార్దన్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జనార్దన్

చేవెళ్ల: సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్.జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీపీ పాఠశాలలో శనివారం 'నేటి సమాజంలో ఆడపిల్లలు ఎలా ఎదగాలి' అనే అంశంపై విద్యార్థులకు మోటివేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి రాజ్యాంగం చదవాలన్నారు. చట్టం ప్రకారం నడవాలని హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. చదువుతో పాటు సమాజాన్ని అధ్యాయనం చేయాలని తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. కవయిత్రి మొల్ల కళావేదిక తాండూరు పౌండర్ అధ్యక్షుడు కె. వెంకట్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచానికి తగిన విధంగా విద్యార్థినులు చదువు కోవాలని చెప్పారు. ఏకాగ్రతతో చదివి మంచి రంగాన్ని ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డు సీఐ సీహెచ్ మాణిక్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ అద్భుత పథకం

బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి



కార్డులను అందజేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పేదలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను శ్రీవర్ధన్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన అనేది భారత ప్రభుత్వ జాతీయ ప్రజారోగ్య బీమానిధి అన్నారు. తక్కువ ఆదాయాన్ని సంపాదించే వారికి ఈ ప్రజారోగ్య బీమానిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో 2018లోనే అమలు చేశారని చెప్పారు. కుల, మత విభేదాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం నేరుగా పేదలకోసం ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. సుకన్య సమృద్ధి యోజన, ఫసల్ బీమా, సురక్ష బీమాలాంటి అనేక పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, బాబయ్య, అశోక్‌గౌడ్, వెంకటేష్, మురళి, శేఖర్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, స్థలాలు ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. కానీ, ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు మొండి చేయి చూపించిందని మండిపడ్డారు. జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పలు చోట్ల భూ కబ్జాలకు పాల్పడినట్లు తెలిపారు. కబ్జాదారుల నుంచి భూములను కాపాడి పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, కె. రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుధాకర్‌గౌడ్, సభున్‌రెడ్డి, అంజయ్య, సత్తిరెడ్డి, మక్బుల్, సుధీర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 3,715 కేసుల పరిష్కారం

- మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు 33,
- ఈ–పెట్టి కేసులు 425 పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జిదేవి మానస, న్యాయవాదులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో పెండింగ్ కేసులు పరిష్కారమయ్యాయి. ట్రాఫిక్ కేసులకు సంబంధించి లోక్ అదాలత్, ఇతర కేసులకు సంబంధించిన లోక్ అదాలత్‌లు వేర్వేరుగా జరిగాయి. జడ్జి దేవిమానస ఆధ్వర్యంలో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 3715 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఇరువర్గాల వారు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకున్నట్లు చెప్పారు. చేవెళ్ల కోర్టు ఆవరణలోనే ట్రాఫిక్ కేసులకు సంబంధించి నిర్వహించిన లోక్ అదాలత్‌లో రిటైర్డు జడ్జి సాంబశివరావు ఆధ్వర్యంలో 33 మద్యం సేవించి పట్టుబడిన కేసులు, ఈ– పెట్టి కేసులు 425 పరిష్కరించినట్లు తెలిపారు. గత పది రోజులుగా నిర్వహించిన లోక్ అదాలత్ ఈ రోజుతో ముగిసింది. ఈ మెగా లోక్ అదాలత్‌లో బార్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి న్యాయవాదులు పాండురంగారెడ్డి, బి.యాదిరెడ్డి, బి.రామక్రిష్ణ, బి.సురేశ్, జి.రాఘవేందర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, జనార్దన్, ఏఎస్ఐ చందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఆలయ కమిటీ సభ్యుడు శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. భజనలు, భక్తి పాటలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం పట్టణానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా అన్నదాతలకు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియచేశారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, రమేష్, రఘుగౌడ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, కిషన్‌నాయక్, నారాయణ, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మి కాంత్‌రెడ్డి, కృష్ణాచారి, బచ్చన్న, శంకర్‌గౌడ్, సత్తయ్య, లక్ష్మయ్య, సుగుణ పాల్గొన్నారు.